

# వెన్నెలదీపాలు

## – డా.యండమూరి వీరేంద్రనాథ్

*(యండమూరి వీరేంద్రనాథ్ గారి రచనాశైలి గురించి పాఠకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చెప్పే అంశం ఏదైనా, మనసుకి హత్తుకునేలా, మనసుల్ని కదిలించేలా అక్షరరూపం ఇవ్వడం యండమూరిగారి ప్రతి రచనలోనూ స్పష్టంగా కన్పిస్తుంది. ఆయన వ్రాసిన 'విజయానికి ఆరో మెట్టు' పుస్తకంలోని చిన్నచిన్న సంఘటనలను ప్రతినెలా మీకందిస్తున్నాము. ప్రతి సంఘటనా ఏదో ఒక నిత్యజీవితసత్యంపై వెలుగులు ప్రసరింపచేస్తుంది.. అన్నీ కలిపి వెన్నెలదీపాల్లా మన మనసుల్ని వెలిగిస్తాయి. వీరేంద్రనాథగారి ప్రత్యేక అనుమతితో ఈ చిన్న కథలు కౌముది పాఠకులకోసం..)*

*(గత సంచిక తరువాయి)*

### సౌందర్యం

సౌందర్యాన్ని నువ్వు ఎక్కడని అన్వేషిస్తావు?

దారి చూపితే గానీ కనుగొనలేవు.

ఉదయాన భూపాలం సౌందర్యం. సాయంత్రం కళ్యాణి సౌందర్యం. పిచ్చివాడికి పెనుతుఫాను సౌందర్యం.

సాహసవంతుడికి ఢాకా శబ్దం సౌందర్యం. రాత్రంతా పహరా కాసేవాడికి ప్రత్యూషమే సౌందర్యం. అలసిన వారికి ఆప్యాయత సౌందర్యం. శ్రమజీవులు సుర్యాస్తమయపు కిటికీగుండా సౌందర్యం భూమి వైపు వంగుతూ వుండటం చూసామంటారు.

ప్రమిదలో వెలిగే దీపం సౌందర్యం. పెదవి అంచున ప్రార్థనా గీతం సౌందర్యం.

చెవులు వినే గీతమూ కనులు చూసే రూపమూ కాదు సౌందర్యం.

కనులు మూసుకున్నా రూపాన్ని చూడగల, చెవులు మూసుకున్నా రాగాన్ని వినగల 'హృదయమే' సౌందర్యం.

బిచ్చగత్తె వణికే శరీరంపై నువ్వు కప్పిన శాలువా సౌందర్యం. పసిపిల్ల ప్రేమ అరుపుకి స్పందించటమే సౌందర్యం.

సౌందర్యపు మేలి ముసుగువూ నీవే. దర్పణమూ నీవే. లోపలా బయటా.. నీవే. నీవే.

### ఆవేశంలో నిర్ణయం

చైనాలో చాలా పాపులర్ అయిన కథ ఇది. కోపము, ఆవేశము, ఆవేశంలో తీసుకునే నిర్ణయం మనల్ని ఒక్కోసారి చాలా ఇబ్బంది పెడతాయి. ఆ నిర్ణయం తీసుకున్నాకో, ఆ పనిచేసాకో అప్పటికే చేతులు కాలిపోతాయి. జీవితంలో చాలా చిన్న చిన్న సందర్భాల్లో కూడా ఈ వాస్తవాలు కనపడుతూనే ఉంటాయి. అయినా మనం తప్పులు చేస్తూనే ఉంటాం.

ఒక పెద్ద ఫ్యాక్టరీ యజమాని అకస్మాత్తుగా తన ఆఫీసు నుంచి, ఫ్యాక్టరీకి పరీక్షకి వచ్చాడు. సామాన్లు స్టోర్ చేసే గోడౌన్ పక్కన ఒకడు నిద్రపోతూ కనిపించాడు. యజమానికి చాలా కోపం వచ్చి అతన్ని లేపి "నీ జీతం ఎంత?" అని అడిగాడు.

"నెలకు వెయ్యి రూపాయలు" అన్నాడు ఆ వ్యక్తి. యజమాని జేబులోంచి వెయ్యిరూపాయలు తీసి అతడివైపు విసిరేస్తూ "రేపట్నుంచి ఈ పరిసరాల్లో కనపడకు. నీ సర్వీస్ నాకు అక్కర్లేదు" అన్నాడు. మారుమట్లాడకుండా ఆ వ్యక్తి డబ్బుతీసుకుని వెళ్ళిపోయాడు. మేనేజర్ ఇదంతా కాస్త అయోమయంగా చూడటం గమనించి, ఫ్యాక్టరీ యజమాని చిరాగ్గా "ఎంతకాలం నుంచి ఇతను ఈ విధంగా పనిచేస్తున్నాడు?" అని అడిగాడు.

మేనేజర్ నమ్రతగా "అతను మన దగ్గర పనిచేయట్లేదండి. గోడౌన్‌లో సరుకు దింపటానికి వచ్చిన డెలివరీ ఏజంట్" అన్నాడు. గులాబీకి పైనముల్లు..

నిరాశావాది, గులాబికి క్రింద ముల్లు వున్నందుకు విచారిస్తాడు. ఆశావాది, పైన లేనందుకు ఆనందిస్తాడు.

1870వ సంవత్సరంలో ఇండియానాలో రైట్ అనే బిషప్ వుండేవాడు. చర్చిలో ప్రార్థన చేస్తున్న టైములో రైట్ ఒక కాలేజీ ప్రొఫెసర్‌ని ప్రపంచంలో జరుగుతున్న అద్భుత విషయాలను గురించి అక్కడున్న ప్రజలకు చెప్పమని కోరాడు. అప్పుడు ప్రొఫెసర్ "మనము సాంకేతికంగా చాలా పురోగమించే దిశలో వున్నాము" అన్నాడు.

బిషప్‌కి ప్రొఫెసర్ చెప్పేది అర్థంకాక దానికి మరింత వివరణ ఇవ్వమన్నాడు. అప్పుడు ఆ ప్రొఫెసర్ "ఇంకొక 25 సంవత్సరంలో మనిషి బహుశ గాలిలో ఎగురుతాడు" అని చెప్పాడు.

బిషప్‌కి చాలాకోపం వచ్చింది. 'నేను బైబిల్‌లో చదివిన ప్రకారం గాలిలో ఎగరటమనేది కేవలం పక్షులకి, దేవతలకి మాత్రమే సాధ్యం. నిరర్థకమైన ఇటువంటి సంభాషణ మన చర్చిలో జరగటం నేనొప్పుకోను' అంటూ ఓర్విల్ రైట్, విల్బర్‌రైట్ అనే తన ఇద్దరు పిల్లల్ని తీసుకుని కోపంగా బాయ్‌టకు నడిచాడు.

ఆ ఇద్దరు పిల్లలే రైట్ సోదరులు. విమానాన్ని కనుగొన్నది వారే.

***త్యాగం***

ఏమీ ఆశించకుండా ప్రేమించటం ఎలాగో చెప్పిన పదేళ్ళ కుర్రవాడి కథ ఒకటి చదవండి.

పదేళ్ళ జాన్, తన చెల్లితో ఆడుకుంటూ వుండగా. ఆ పాప పడిపోయి తలకి గాయం తగిలి రక్తం చాలాపోయింది. జాన్‌ది ఆ గ్రూప్ రక్తం. "నువ్వు నీ చెల్లికి కొంచెం రక్తం ఇస్తావా?" అని డాక్టర్ అడిగాడు. ఆ కుర్రవాడు కొంచెం సేపు మౌనంగా వుండిపోయి, కాస్త తటపటాయించి చివరకు 'సరే' అన్నాడు. ఆ కుర్రవాడు ఎందుకు సంశయించాడో డాక్టరు మరోలా అర్థం చేసుకున్నాడు. "పెద్దనొప్పిగా వుండదు. అయిదు నిమిషాల్లో అయిపోతుంది. తరువాత చాక్‌లెట్ ఇస్తాను" అన్నాడు.

తన శరీరంలోంచి రక్తం నెమ్మదిగా సీసాలోకి ఎక్కుతూంటే జాన్ మొహం క్రమక్రమంగా తెల్లబడసాగింది. పాప ఆపరేషన్ విజయవంతంగా పూర్తయింది. జాన్ అలాగే పడుకుని వున్నాడు. డాక్టర్ దగ్గిర కొచ్చి "లే.. చాక్‌లెట్ ఇస్తాను" అన్నాడు. ఆ కుర్రవాడు భయపడుతూ నెమ్మదిగా అడిగాడు. "ఇంకా ఎంత సేపటికి నేను చచ్చిపోతాను డాక్టర్?"

డాక్టర్ విభ్రాంతుడై, "రక్తం తీస్తే మనిషి చచ్చిపోతాడనుకున్నావా?"

"అవును"

డాక్టర్ గొంతు వణికింది. "అనుకునే ఇచ్చావా?" అన్నాడు కంపిస్తూ.

***అర్జునుడి భయం***

నా ఏకాంతం గోడ మీద, చచ్చిపోయిన మా అమ్మ నీడగా మారి నా మనసులో దూరి పెద్ద పెద్ద గంటలు కొడుతున్నట్టు కలలొస్తుంటాయి.

మరచిపోయిన మమతలూ బాల్యంలో బామ్మ చెప్పిన కథలు. పల్లెటూరి పైరు వాసనా, గుర్తుతెచ్చుకుంటూ నేను - ఒంటరి శిలువ మీద నిద్ర మేకులు కొట్టుకుంటూ వుంటాను.

నా ఇంటి కంచెనానుకున్న తుమ్మచెట్టు ముళ్ళపైన, నిత్యం శ్రమించే వడ్రంగి పిట్టకార్మిక గీతాన్ని, రైలింజను కూత నిర్ధాక్షిణ్యంగా నొక్కేస్తుంది.

కర్మాగారం నుంచి వెలువడే ఆమ్లరసపు వాసన సన్నజాజి పరిమళాన్ని ఉరిదీస్తూ నన్ను నిద్రపోనివ్వదు.

చిన్నపిల్లాడి గదిలోకి నిశ్శబ్దంగానే వెళ్ళి వాడి కలల పుస్తకాల్ని నా నిరంకుశపు చేతుల్తో చిందరవందర చేస్తాను.

మూసుకున్నవాడి భవిష్యత్తు కనురెప్పల మీద నా నీడ అడ్డంగాపడుతుంది.

వాడు పెద్దయ్యాక నా జ్ఞాపకంకొట్టే భయంకర గంటల శబ్దం వాడికీ వినిపిస్తుంది.

***ఫియర్ ఆఫ్ ఫెయిల్యూర్***

ఈ 'ఫియర్ ఆఫ్ ఫెయిల్యూర్' అన్నది, దానికి సంబంధించిన వ్యక్తినేకాక, పక్కవారిని కూడా భయపెడుతుంది. ఒక తల్లి ఈ విధంగా అన్నది "మా పిల్లవాడికి పరీక్షలొచ్చాయంటే, అంతకుముందు రాత్రి నాకు నిద్రవుండదు. పరీక్షరోజయితే వాడు ఇంటికొచ్చి 'బాగారాసాను' అని చెప్పేవరకూ కాలూ చెయ్యీ ఆడదు. ఒక్కోసారి పరీక్ష హాలుకి వెళ్ళి పరామర్శించాలని కూడా అనిపిస్తూ ఉంటుంది."

చిన్న పిల్లల్లో, ముఖ్యంగా పసిపిల్లల్లో ఈ భయాన్ని పోగొట్టవలసిన బాధ్యత తల్లులదే అంటాడు ప్రముఖ్ అమానసిక శాస్త్రవేత్త డేనియల్ స్టెర్న్. ఉదాహరణకి ఒక పాప ఉయ్యాల్లో ఆహ్లాదంగా నవ్వుతోంది అనుకుందాం. తల్లి కూడా సంతోషంగా వంగి, పాప మొహంలోకి చూసి నవ్వుతుంది. తరువాత పాపని వదిలి తన పని చూసుకోవటానికి వెళ్తుంది. మరోరకంగా చెప్పాలంటే, పాప సంతోషాన్ని తల్లి తక్కువ కాలం పంచుకుంటుంది. పాప సంతోషంగా వున్నప్పుడు తక్కువ లాలిస్తుంది. అదే పాప ఏడుస్తున్నప్పుడు, ఉయ్యాల్లోంచి తన వళ్ళోకి తీసుకుంటుంది. ఏడుపు ఆపేవరకూ లాలిస్తుంది. మరో రకంగా చెప్పాలంటే 'తాను ఎత్తుకోబడాలి అన్న కోరికని తల్లికి చెప్పాలీ అంటే తాను ఏడవాలి' అన్న ఇన్‌డైరెక్ట్ సజెషన్‌ని పాపకి తల్లి ఇస్తుందన్నమాట.

ఈ విధంగ ఒక ఓదార్పుకీ, ఒక కోరికకీ మధ్య తల్లి ట్రీట్‌మెంట్‌లో తేడా లేకపోతే, పిల్లలు చిన్న వయసు నుంచే ఆధారపడటం క్రమంగా అలవాటు చేసుకుంటారని అంటాడు స్టెర్న్. అందుకే పిల్లలు ఆనందంగా వున్నప్పుడు వారితో ఎక్కువకాలం గడపటం - వారికి "ఎక్కువ ఆనందంగా వుండటాన్ని" అలవాటు చేస్తుందంటాడు. అదే విధంగా, కోపం ప్రదర్శిస్తే తమ పనులు నెరవేరతాయన్న భావాన్ని పిల్లల్లో కలగచెయ్యకూడదంటాడు. అందుకే, కొందరు పిల్లలు, తాము అడిగిన టిఫిన్ చేసిపెట్టకపోతే కాళ్ళు నేలకి కొడుతూ ఏడుస్తారు. ఏ పాయింటు దగ్గర తమ తల్లిదండ్రులు బ్రేక్ అవుతారో పిల్లలకు బాగా తెలుసు. ఇలాటివన్నీ, తాము అనుకున్నది సాధించుకోవటం కోస్మే పిల్లలు ఏర్పర్చుకునే యుద్ధతంత్రాలని ఆ సైకాలజిస్టు భావన.

అల్లరి చేసే పిల్లల్ని తెలివైన వారిగా చేయటం కోసం, వారి మధ్య పోటీలు పెట్టి బహుమతులు ఇవ్వాలి 100, 93, 86 - ఇలా 7 అంకెల తేడాతో '2'వరకూ తక్కువ తప్పుల్తో తొందరగా వ్రాసిన పిల్లవాడికి బహుమతులు ఇవ్వండి.

***"కోపంలోంచి దుఃఖంలోకి.."***

అన్నా చెల్లెళ్ళు కవలలు. చెల్లి ఏడుస్తుంది. అన్న ఓదారుస్తున్నాడు. చెల్లి దుఃఖం మానిపించటానికి తన బొమ్మ ఇచ్చాడు. ఆ పాప దుఃఖం మానింది. అన్న ఆనందించాడు. అతడు తిరిగి దేన్నీ ఆశించకపోవటం వల్ల కలిగే ఆనందం ఇది. ఇది ఒక ఉదాహరణ.

కాలేజీలో చెల్లి బోయ్ ఫ్రెండ్‌తో కనపడింది. తాను తన గర్ల్ ఫ్రెండ్‌తో రొమాంటిక్‌గా గడుపుతున్న విధానం గుర్తొచ్చింది. చెల్లిని చంపేద్దామన్నంత కోపం కలిగింది. ఇది మరొక ఉదాహరణ.

అదే చెల్లికి పెళ్ళి చేయుతం కోసం అప్పుచేద్దామనుకుంటున్నారు తల్లిదండ్రులు. వారికి అనారోగ్యం. వారు కూడబెట్టినదంతా చెల్లిపెళ్ళికే సరిపోతే, వారి ఆస్పత్రి ఖర్చువల్ల తనమీద అప్పు బరువు పడుతుందన్న భయంతో అలజడి కలిగింది.

ఇదొక ఉదాహరణ. పెళ్ళికి ముందురోజు చెల్లి మరణించింది. చిన్నప్పటి ఆటలు గుర్తొచ్చి దుఃఖించాలో అప్పులేనందుకు సంతోషించాలో 'సందిగ్ధం' కలిగింది. (ఒక వేళ ఆ పాటికే కట్నం డబ్బు కాబోయే మావగారికి ఇచ్చేసి ఉంటే తిరిగి ఎలా వసూలు చేసుకోవాలన్న 'ఆరాటం' కలిగి ఉండేది). ఎన్ని రకాల స్థాయీ భావాలో చూడండి.

***కావాల్సింది - కాలేజీలో చెప్పనిది***

అడొలిసెన్స్ వయసు, పిల్లలకి చాలా సమస్యాత్మకమైనది. క్లాసులో మంచి మార్కులు తెచ్చుకోవాలి. తోటివారితో హుషారుగా వుండాలి. జీవితం పట్ల బాధ్యతగా వుండాలని తల్లిదండ్రులు చెపుతారు. నిర్లక్ష్యంగా వుండాలని స్నేహితులు చెప్తారు. అన్నయ్యల్తో సమస్య చెల్లెళ్ళతో మరో సమస్య. ఎన్నెన్నో తీరని కోరికలు. ఒకవైపు పరిక్షలపట్ల టెన్షన్, సరిగ్గా తెలియని గమ్యం. అలజడి, ఆర్థిక పరమైన ఇబ్బందులు.

ఇంట్లో తల్లిదండ్రుల మధ్య గొడవలు. తండ్రి ఒక రకం. తల్లి ఒకరకం. ఎవర్ని సపోర్ట్ చెయ్యాలో తెలీదు.

ఇవన్నీకాక, తనలో వుండే ఎమోషన్స్. సరి అయిన సపోర్ట్ రకని ఒంటరితనం.

ఇలాంటి సమస్యలన్నింటినీ ఎదుర్కొంటూ కూడా యువత జీవితంలో "గెలవటం" అభినందనీయం. అలా గెలవటం కోసం, సమస్యల్నుంచి బయటపడటం కోసం, ఇదే పుస్తకంలోని "జ్ఞానం" అన్న అధ్యాయం ఆధారంగా నా రాబోయే పుస్తకం "విద్యార్థి విజయం."

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments